ఈనాడు ఎన్ఆర్ఐ

# అమెరికాలో అప్రమత్తతే శ్రీరామరక్ష!

## తగిన జాగ్రత్తలు తీసుకుంటే సురక్షితంగా ఉండొచ్చు

భారతీయ అమెరికన్ మైత్రి మండలి

జాతీయ సంఘం అధ్యక్షుడు ప్రసాద్ తోటకూర సూచనలు

డల్లాస్



కేన్సస్‌లో భారత ఇంజినీరు కూచిభొట్ల శ్రీనివాస్ హత్యతో భారత్‌తోపాటు అమెరికాలోనూ ప్రస్తుతం తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. వివక్ష ఎప్పుడు ఏ వైపు నుంచి కాటేస్తుందోనని పలువురు భారతీయ అమెరికన్లు భయాందోళనలకు గురవుతున్నారు! అయితే, అమెరికా చట్టాలను గౌరవిస్తూ అప్రమత్తంగా ఉంటే ఆ దేశంలో సురక్షితంగా ఉండొచ్చని చెబుతున్నారు భారతీయ అమెరికన్ మైత్రి మండలి జాతీయ సంఘం అధ్యక్షుడు, తానా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్ తోటకూర. కూచిభొట్ల శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఆయన.. అమెరికాలో తుపాకీ సంస్కృతి, వివక్షకు బలి కాకుండా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలను భారతీయులకు ఓ ప్రకటనలో వివరించారు.

**ఇరుగు పొరుగుతో సఖ్యత:** ఇరుగు పొరుగు పేర్లు, వివరాలను భారతీయ అమెరికన్లు తెలుసుకోవాలి. తాము జరుపుకునే సంప్రదాయ వేడుకలకు వారిని ఆహ్వానించాలి. మన సంస్కృతితో వారికి అనుబంధం ఏర్పర్చాలి. వారాంతపు విందులు ఏర్పాటు చేసుకుంటే.. భారీ శబ్దాలతో చుట్టుపక్కలవారికి అసౌకర్యం కలిగించొద్దు. వారి నిద్రను పాడుచేయొద్దు. వాహనాలు నిలిపేచోట జాగ్రత్తగా ఉండాలి. ఇతరుల రాకపోకలకు అంతరాయం కలగకుండా చూసుకోవాలి. స్థానిక అధికారులు, రాజకీయ నాయకులతో పరిచయం పెంచుకోవాలి.

**అమెరికా జాతీయ జెండాను గౌరవించండి:** అమెరికాలో భారత జాతీయ జెండాను ఎప్పుడూ ఒంటరిగా ఎగరవేయకూడదు. పక్కనే అమెరికా జెండా కూడా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. అమెరికా రాజ్యాంగానికి, చట్టాలకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉండాలి. ఇతరులకు వింతగా కనిపించే, ఇబ్బంది కలిగించే దుస్తులను ధరించకూడదు. ప్రముఖ రాజకీయ నాయకులు, సినీనటులు వచ్చినప్పుడు అత్యుత్సాహం ప్రదర్శించొద్దు. పెద్దయెత్తున నినాదాలు, కేరింతలతో ఇతరుల శాంతికి భంగం కలిగించకూడదు.

**భారత్ నుంచి అతిథులు వస్తే..:** భారత్ నుంచి వచ్చే తల్లిదండ్రులు, అతిథులకు అమెరికా సంస్కృతి, సంప్రదాయాలపై ముందుగానే అవగాహన కల్పించాలి. అమెరికన్లవైపు వింతగా చూడొద్దు. ముఖ్యంగా వారు ఈత దుస్తుల్లో ఉన్నప్పుడు తదేకంగా చూడటం, నవ్వడం, వారికి అర్థం కాని భాషలో మాట్లాడుకోవడం తగదు. అక్కడి పరిసరాలకు పూర్తిగా అలవాటుపడేవరకు తల్లిదండ్రులు, అతిథులను ఒంటరిగా వదిలేయకూడదు.

**రోడ్లపై జాగ్రత్త:** వాహనాలను నడిపేటప్పుడు పాదచారులకు దారి ఇవ్వాలి. పాఠశాలల వద్ద వేగ పరిమితులను పాటించడం తప్పనిసరి. అడ్డదిడ్డంగా రోడ్లు దాటకూడదు. దివ్యాంగులకు కేటాయించిన స్థానాలను వారికే వదిలేయాలి.

**అర్ధరాత్రుల వరకు బార్లలో వద్దు:** అధికారులతో మాట్లాడేటప్పుడు వారిని గౌరవించాలి. వారికి వాస్తవాలను మాత్రమే తెలియజేయాలి. ఎదుటివారితో వాదనలు, ఘర్షణలకు దిగకూడదు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, గట్టిగా అరవడం చట్టవిరుద్ధం. ముఖ్యంగా విమానాశ్రయాలు, రెస్టారెంట్లు, బార్లలో తమాషాలు చేయకూడదు. అర్ధరాత్రుల వరకు బార్లు, రెస్టారెంట్లు, పబ్బుల్లో ఉండకపోవడం మేలు.

**సామాజిక మాధ్యమాలతో బహుపరాక్:** ఫేస్‌బుక్, ట్విటర్, వాట్సప్‌లలో పుకార్లను సరదాకు కూడా వ్యాప్తి చేయకూడదు. అశ్లీల వెబ్‌సైట్లలో సందేశాలు పంపితే మూల్యం తప్పదు. గతంలో అలా పంపిన చాలామందిని అధికారులు దేశం నుంచి పంపించేశారు.

**డబ్బు కంటే ప్రాణం విలువైనది:** మీ ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లుతోందని భావిస్తే.. న్యాయస్థానాలను ఆశ్రయించండి. మీ దగ్గర ఉన్న నగదు, ఇతర ఖరీదైన వస్తువుల కంటే ప్రాణమే అత్యంత విలువైనదని గుర్తుంచుకోండి. డబ్బు కోసం ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమాలకు పాల్పడొద్దు. అమెరికాలో అక్రమంగా నివసిస్తున్నవారికి ఆశ్రయం ఇవ్వడం, వారికి ఉద్యోగమివ్వడం నేరం.

**ఇంట్లో ఉంటే..:** ఎప్పుడూ ఇంటి తలుపులు వేసుకొనే ఉండాలి. గుర్తుతెలియని వ్యక్తులు వస్తే తలుపులు తీయొద్దు. ఇంటి నుంచి బయటకు వెళ్తే.. సంబంధిత భద్రత అలారంను ఆన్ చేయాలి. పార్టీలు, శుభకార్యాలకు వెళ్లినప్పుడు బంగారు ఆభరణాలు ధరించడం మనకు అలవాటు. కానీ, చాలావరకు దొంగతనాలకు బంగారమే కారణం. విలువైన వస్తువులు, బంగారు నగలను బ్యాంకు లాకర్లలో సురక్షితంగా ఉంచుకోవడమే ఉత్తమం.

**పిల్లలపై చేయిచేసుకోవద్దు:** పిల్లలను ఎప్పుడూ ఒంటరిగా వదిలి వెళ్లకూడదు. వారిపై కోపం, విసుగు ప్రదర్శించొద్దు. చేయిచేసుకోవద్దు. పిల్లలతో దురుసుగా ప్రవర్తిస్తే.. చిన్నారుల రక్షిత సేవా సంస్థ వారు పిల్లలను తీసుకెళ్తారు. తల్లిదండ్రులను శిక్షిస్తారు.

## గుర్తింపు కార్డు మర్చిపోవద్దు

పాస్‌పోర్ట్, చట్టపరమైన గుర్తింపు కార్డు కాపీలను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలి. సెల్‌ఫోన్‌ను కూడా దగ్గరే పెట్టుకోవాలి. పోలీసులు, ఇతర భద్రతాధికారుల సూచనలను పాటించాలి. పరిసర ప్రాంతాలను జాగ్రత్తగా గమనిస్తూ.. అప్రమత్తంగా ఉండాలి.